క్లుప్తంగా

క్వాలిఫైడ్ టీచర్ల రిటైర్మెంట్‌ను పొడిగించాలి



ఎంటీఎస్ ఉపాధ్యాయులకు లెటర్ అందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో 1998 క్వాలిఫై టీచర్ల ఎంటీస్ టీచర్లగా నియమించారని అయితే 25 సంవత్సరాల కాలం వృథా అవ్వడం వల్ల ప్రస్తుతం ఎంటీఎస్ ఉపాధ్యాయులు అందరూ 60 వయసు వారు కూడా ఉన్నారని వారికి రిటైర్డ్ వయస్సును 62 ఏళ్ల చేయాలని ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి రాంబాబు పీఎస్‌వీఎస్ సుబ్బారావు, టీవీవీ సత్యనారాయణ, ఎస్.బ్రహ్మం వి.రామ్మోహన్ మురళి తదితర ఉపాధ్యాయులు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వేణుకి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వేణు రికమండ్ చేస్తూ లెటర్‌ను అందించినట్లు వారు తెలిపారు.

ఎరువులు, పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

కాజులూరు: ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంటలపై వినియోగించే ఎరువులు, పురుగుమందుల మోతాదుపై సూచనలు చేశారు. పంటలపై అవసరాన్ని మించి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయరాదన్నారు. ఎరువులు, గుళికలు వేసేటప్పుడు పొలంలో నీరు తక్కువగా ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. ఎరువుల్లో గుళికలు కలిపి ఉపయోగించరాదన్నారు. పొలాల్లో ఎరువులు, పురుగుమందుల వినియోగంపై స్థానిక ఆర్‌బీకేల్లో వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. రైతులు ఎక్కువగా వినియోగించే పలు రకాల ఎరువుల్లో ఏఏ మందు శాతం ఎంతెంత ఉంటుంది రైతులకు వివరించారు.

నిడసనమెట్టలో కనకదుర్గాంబిక విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: నిడసనమెట్టలో కనకదుర్గాంబిక ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, టీటీడీ ఎస్‌వీబీసీ అడ్వయిజర్ అడపా దుర్గ, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన వాసన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు సహకారంతో నిర్మించిన ఆలయంలో వేద పండితులు హోమ పూజలు చేశారు. కార్యక్రమంలో నిడసనమెట్ట సర్పంచ్ పుట్టపూడి పవన్, సుబ్రహ్మణ్యం, వాసన బాబూరావు, పిల్లా సాయిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాలను అరికట్టాలంటూ ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సై జానీ బాషా తదితరులు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల బాల్య వివాహాలు చేస్తున్నారని ప్రతి ఒక్కరూ బాధ్యతగా బాల్య వివాహాలను అరిట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎస్సై జానీ బాషా అన్నారు. మండలంలోని సుందరపల్లి సచివాలయం వద్ద సోమవారం బాల్య వివాహ రహిత భారత దేశం కార్యక్రమంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధ చట్టాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని గుర్తు చేశారు. బాల్యవివాహాల వల్ల చాలా అనర్థాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. అనంతరం ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ సలాది లక్ష్మీశిరీష, ఎంపీటీసీ తాడాల రాజు, గ్రామ పెద్దలు రెడ్డి జయరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామంటూ పడమర ఖండ్రికలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో జరుగుతున్న పరిణామాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని జీవించేందుకు చదువు అత్యంత అవసరమన్నారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, చట్టం నిర్దేశించిన వయస్సుకే వివాహం చేయాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణకే పథకాలు

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- ఉచితంగా మందుల పంపిణీ



గొల్లపాలెం జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రసంగిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: డబ్బులేక ఏ వ్యక్తి అనారోగ్యంతో బాధపడకూడదనే సీఎం జగన్ పేదల ఆరోగ్య రక్షణ కోసం అనేక పథకాలు రూపొందిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం గొల్లపాలెం గ్రామ సచివాయం-2 పరిధిలో గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అధ్యక్షతన వైద్యాధికారులు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సు సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వాటితో పాటు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 10032 విలేజ్ హెల్త్‌సెంటర్లు, 17 మెడికల్ కళాశాలలు నిర్మించి ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో 53800 స్పెషలిస్టు డాక్టర్లను, నర్సులను నియమించారన్నారు. ప్రజారోగ్యం కోసం ఇంత పెద్దెత్తున పథకాలు రూపొందిస్తున్నా ఇంకా గ్రామాల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారనే భావనతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, ఆర్ఎంసీ డైరెక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, తాడి రామారెడ్డి, వైద్యసిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అముజూరులో..

కె.గంగవరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని అముజూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ నానాపరపు కళ్యాణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీ సీతిపూడి మధుబాల, ఎంఈఓ నాగరాజు, గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, గెద్దాడ సతీష్, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పడమరఖండ్రికలో 546 మందికి వైద్యం

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలున్న 546 మందికి ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు చేశారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో శిబిరంలో 249 మంది మహిళలు, 297 మంది పురుషులకు వైద్య పరీక్షలు చేశారు. చిన్నారుల సమస్యలపై ఆరు, గర్భకోశ 36, జనరల్ మెడిసిన్ 106, కంటి 102, ఎముకలు 124, ఇతర సమస్యలపై 172 మందిని పరీక్షించారు. మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని ఉన్నతాసుపత్రులకు సిఫార్సు చేశారు. 17 మంది వృద్ధులు, ఐదుగురు చిన్నారులకు కళ్ళజోళ్ళు ఉచితంగా ఇచ్చేందుకు నిర్ణయించారు. శిబిరంలో వైద్యులు జీవీ గీతాంజలి, కరుణేంద్రకుమారి, రమ్యలక్ష్మి, లోకేష్, ఎస్‌వీ సత్యనారాయణ వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి సందర్శించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులకు ఎంపీపీ సత్యవేణి తదితర ప్రజాప్రతినిధులు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి శేషారత్నం, పీహెచ్‌సీ హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఓ జిత్తుక మల్లికార్జునరావు, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

పాలతోడులో 385 మందికి..

మండపేట: మండలంలోని పాలతోడు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు ప్రారంభించారు. శిబిరంలో 385 మందికి వైద్య సేవలు అందించారు. 125 మందికి కంటి పరీక్షలు చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈఓ ఎస్‌వీ రామారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రోగులకు అవసరమైన పలు రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాల బ్రాండెడ్ మందులను శిబిరం వద్ద అందుబాటులో ఉంచారు. రోగి సమస్యను బట్టి వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు గంగరాజు దేవీప్రసాద్, వైస్ సర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, తుమ్మా వీరబాబు, పిల్లా చంద్రరావు, పెయ్యల వెంకన్న, చంద్రమళ్ల శ్రీను, పిల్లెల్లి పోతురాజు, కుడిపూడి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



అముజూరు సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



పడమర ఖండ్రికలో వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్ కరుణేంద్రకుమారి



పాలతోడులో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి దంపతులు

తోటపేటలో..

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం తపిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తోటపేటలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రారంభించి పేదల పాలిట పెన్నిధి అయ్యారన్నారు. ఆయన 2000 రకాల జబ్బులను ఆరోగ్యశ్రీలో పెడితే, ముఖ్యమంత్రి జగనన్న 3522 రకాల జబ్బులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారన్నారు. ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న వారికి ఆ సమయంలో జీవనోపాధికి ఇబ్బంది కలగకూడదని ఆర్థికసాయం కూడా అందిస్తున్న మనసున్న సీఎం జగన్ అని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో 457 మంది వైద్య సేవలు పొందారు. వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రత్నసుధ, డాక్టర్ సునీత, డాక్టర్ ఎస్ఆర్‌సీ మూర్తి, కంటి వైద్య నిపుణుడు కోటేశ్వరరావు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరపు కామరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దామిశెట్టి సత్యనారాయణమూర్తి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ ఒక్కటే

- కాపుల ఓట్లు కొల్లగొట్టేందుకు ఇద్దరూ డ్రామాలు
- ప్రజలకు వాస్తవాలు తెలుసు
- కేశవరంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కేశవరంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న రైతులు

మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఇద్దరూ ఒక్కటే అన్న విషయం నియోజకవర్గ ప్రజలకు తెలుసునని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జనసేనలోని కాపు సామాజికవర్గం ఓట్లు బయటకు పోతాయన్న భయంతో సీటు నాదంటే నాదంటూ ఇద్దరు కొత్త డ్రామాలు మొదలు పెట్టారని తోట విమర్శించారు. మండలంలోని కేశవరంలో రూ.2.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తితో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సర్పంచ్ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడారు. టీడీపీ, జనసేన పొత్తులో మండపేట సీటును టీడీపీ కేటాయిస్తారన్ని విషయం అందరికీ తెలిసిందేనన్నారు. జనసేన పార్టీలోని కాపు సామాజికవర్గం వారు వైఎస్సార్ సీపీలోకి వెళ్లిపోతారన్న భయంతో వారు బయటకు రాకుండా ఎన్నికల జిమ్మిక్కులు చేస్తున్నారన్నారు. సీటు నాదేనంటూ ఎన్నికల వరకు లీలాకృష్ణ కేడర్‌ను మభ్యపెట్టి, చివరి నిముషంలో టీడీపీకి ఇచ్చారని చెబుతారన్నారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించి టీడీపీకి పనిచేయాలని చెప్పి కేడర్ అంతటిని గుంపగుత్తుగా కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే వేగుళ్లతో బేరం కుదుర్చుకుంటారని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. గ్రామాల్లో కేవలం కాపు సామాజిక వర్గం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే లీలాకృష్ణ పర్యటించి సీటు నాదే నని ప్రచారం చేసుకోవడంలో ఆంతర్యం ఇదేనని తోట పేర్కొన్నారు. మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్లకు చెందిన లేఅవుట్ లో పవన్ కల్యాణ్ సభ ఏర్పాటు చేసినపుడే వారి చీకటి రాజకీయాలు బహిర్గతం అయ్యాయని విమర్శించారు.

ఎమ్మెల్సీ తోటకు ఘన సన్మానం

మూడు దశాబ్దాల కాలంగా తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పుంత రోడ్లను అభివృద్ధి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బహిరంగ సభలో ఆదర్శ రైతు సలాది శివన్నారాయణ, పార్టీలకు అతీతంగా గ్రామంలోని రైతులందరూ ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు.

గ్రామాభివృద్ధికి కృషి

కేశవరం గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తానని ఎమ్మెల్సీ తోట తెలిపారు. రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని, త్వరలోనే స్థలసేకరణ మొదలవుతుందన్నారు. తొలుత రైల్వే గేటు వంతెన వద్ద ఏర్పాటుచేసిన సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్పులతో పూల వర్షం కురిపిస్తూ గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, రాయవరం, కపిలేశ్వరపురం ఎంపీపీలు నౌడు వెంకటరమణ, మేడిశెట్టి సత్యవేణి, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, సొసైటీ చైర్మన్లు ముక్కపాటి శ్రీనివాస్, ముక్కపాటి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వుండమట్ల తాతాజీ, పెదపాటి ఉమమాహేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి చెల్లుబోయిన వేణు



నరజాడలో పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కూళ్ల, నరజాడ, ఎస్సీ కాలనీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ అందించాలనే ఉద్దేశంతో నవరత్న పథకాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. ప్రభుత్వం పేదలకు మంచి చేయాలని ఉద్దేశంతో పని చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక అర్థం లేని వాదనలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రానున్న కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు బాలాజీ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, నాయకులు సాదా వెంగళరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనరంజకంగా జగన్ పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో గడప గడపకూ..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని కేశవరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి తదితరులతో కలిసి ఆ గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి వీధి, పల్లపువీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్సీ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ స్థానికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన వివిధ సమస్యలపై ఎంపీడీఓ ఐ రాజు, ఈఓ సుబ్బారావులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అంతకు ముందు ఆంజనేయస్వామి గుడి వద్ద రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, ఫిషర్‌మెన్ సొసైటీ కోసం రూ.4.47 లక్షలతో నిర్మించిన షెడ్డు, వత్సవాయ చెరువు వద్ద రూ.ఆరు లక్షలతో నిర్మించిన దోబీ ఘాట్ తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పెదపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, పార్టీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, కూసు అబ్బు, అల్లంపల్లి కిషోర్, రాయిపాటి సత్యనారాయణ, చేబోలు సత్తిబాబు, కొల్లి సుబ్రహ్మణ్యం, యడ్ల రవి, చంద్రమళ్ల లాజురు, చంద్రమళ్ల ప్రకాష్ పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీం



ఇబ్రహీంను అభినందిస్తున్న సంఘ నాయకులు

మండపేట: నూర్‌బాషా సంక్షేమ సంఘం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా మండపేటకు చెందిన షేక్ ఇబ్రహీం నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఇబ్రహీం తెలిపారు. స్థానిక డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్టు భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూర్‌బాషాల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఇబ్రహీంను సంఘ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు షేక్ సుభానీ, సల్మాన్ హుస్సేన్ తదితరులు అభినందించారు.

సింహగర్జన విజయవంతం చేయాలి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నూర్‌బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో నూర్‌బాషా సింహగర్జన ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు షేక్ సుభాన్ తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్టు భవన్‌లో ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున నూర్‌బాషాలు, దూదేకుల వారు తరలి వచ్చి సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు షేక్ ఇబ్రహీం, షేక్ సలీం, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మను కొలిస్తే అన్నీ శుభాలే

- బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన విజయదుర్గమ్మ

రాయవరం: దుష్ట సంహారం చేస్తూ.. శిష్టరక్షణ పాలన చేసే దుర్గమ్మను కొలిస్తే శుభాలు వెన్నంటే ఉంటాయని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు విజయదుర్గా పీఠంలో రెండో రోజు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠానికి హాజరైన భక్తులనుద్దేశించి, ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతి ఒక్కరూ ఏకాగ్రత, చిత్తశుద్ధితో అమ్మవారిని పూజిస్తే అమ్మ కృపకు పాత్రులవుతారన్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల ప్రాధాన్యం, బాలాత్రిపుర సుందరీదేవి అవతార ప్రాధాన్యాన్ని గాడ్ భక్తులకు వివరించారు. తొలుత విజయదుర్గమ్మ వారిని బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో స్వయంగా కలశాలు ఏర్పాటు చేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అసోసియేట్ మాజీ రీజనల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, పలువురు భక్తులు పూజల అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు.

రామచంద్రపురం రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు ఘనంగా జరిగాయి. మాణిక్యాంబా అమ్మవారు రెండో రోజు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు అలరించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో రెండో రోజు బాలాత్రిపుర సుందరి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి శ్రీరామకృష్ణ, ఉపాధ్యక్షుడు బచ్చు వీరభద్రలక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి సూర్యశేఖర్, సమయమంతుల సత్యానందం పూజల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు రెండో రోజు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

గాయత్రీదేవిగా..

రామచంద్రపురం: దసరా మహోత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ అమ్మవారు రెండో రోజు గాయత్రీ దేవిగా భక్తులను దర్శనమిచ్చారు. పట్టణంలోని కొత్తూరు రోడ్డు జోడుతూముల వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారిని, శివాలయం వీధిలోని దుర్గమ్మ అమ్మవారిని, ప్రధాన రహదారిలోని సరస్వతీదేవి అమ్మవారిని శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు.

25 నుంచి ద్వారపూడిలో గడప గడపకూ..

- దాదాపు 20 రోజుల పాటు ఎమ్మెల్సీ తోట పర్యటన
- విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజు విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజు

మండపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారపూడిలో విజయవంతం చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీఓ ఐ. రాజు కోరారు. గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఆ పంచాయతీ గ్రామ కార్యదర్శి రమణ అధ్యక్షతన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఎంపీడీఓ రాజు, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు మాట్లాడారు. ఈనెల 25 నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఉదయం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొంటారని తెలిపారు. మేజర్ పంచాయతీ అయినందున దాదాపు 20 రోజుల పాటు కార్యక్రమం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ శేషారావు విజ్ఞప్తి చేశారు. ఈఓ రమణ మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, అప్రమత్తంగా పనిచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోతుల రాంబాబు, గూడూరి సుబ్బరాజు, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, నామాల శ్రీనివాసరావు, సత్తి శ్రీనివాస్, మేకా మణి, పోతుల దుర్గాప్రసాద్, సలాది గౌరినాయుడు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో స్థానిక జెడ్పీటీసీపై దాడికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుండగా వేదికపైకి వెళుతున్న తనపై స్థానిక భూస్వామి దామిశెట్టి గంగాపురుషోత్తం, అతని కుమారుడు దామిశెట్టి సత్యనారాయణమూర్తిలు దాడి చేసి గాయపరిచారని జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.